ప్రసన్నకుమార్, దిల్‌రాజు, దామోదరప్రసాద్, సునీల్ నారంగ్, టీజీ విశ్వప్రసాద్

సంక్రాంతి బరిలో నుంచి తప్పుకున్న 'ఈగల్'

సంక్రాంతి సినిమాల రిలీజ్‌ల గురించి గురువారం తెలుగు ఫిలిం ఛాంబర్, తెలంగాణ ఫిలిం ఛాంబర్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న విడుదలకు సిద్ధమైన రవితేజ 'ఈగల్' సినిమాను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ హీరో రవి తేజ, పీపుల్స్ మీడియా వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలనుకున్న ఐదు సినిమాల నిర్మాతలతో సమావేశమై ఏదో ఒక సినిమాను వాయిదా వేయాలని కోరామని చెప్పారు. ఒక సినిమా వెనక్కి తగ్గితే ఏదో జరిగిపోయినట్టు కాకుండా రవితేజ సహకరించిన తీరును చూసి ప్రేక్షకులు గర్వపడాలని, ఈ నిర్ణయాన్ని సహృదయంతో స్వీకరించాలని కోరారు. నిరుడు సంక్రాంతి సందర్భంగా మూడు సినిమాలకే ఇబ్బంది అయ్యిందని, ఈ సారి ఐదు సినిమాలు విడుదల చేస్తే గత ఏడాది పరిస్థితే ఏర్పడుతుందన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అభ్యర్థన మేరకు 'ఈగల్' సినిమా వాయిదా వేసుకున్నారని దిల్‌రాజు చెప్పారు. ఫిబ్రవరి 9న రిలీజ్ కావాలని అడుగుతున్నారని.. అదే రోజున రెండు సినిమాలు విడుదలవుతున్నట్టు గతంలోనే ప్రకటించారని ఆయన చెప్పారు. నిర్మాత నాగవంశీ 'టిల్లు స్క్వేర్'ను మరో తేదీకి వాయిదా వేసుకునేందుకు సిద్ధమయ్యారని, మరో చిత్రం 'యాత్ర-2' కూడా వాయిదా వేసుకోవాలని మేకర్స్‌ను అడుగుతామని దిల్‌రాజు అన్నారు.

అమీర్‌ఖాన్ కూతురు వివాహం

నుపుర్ శిఖరే, అమీర్‌ఖాన్, ఐరాఖాన్

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్-రీనాదత్తాల కుమార్తె ఐరా ఖాన్ గురువారం వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. బంధువులు, స్నేహితుల సమక్షంలో ఫిట్‌నెస్ ట్రైనర్ అయిన తన ప్రియుడు నుపుర్ శిఖరేను ఆమె పెండ్లి చేసుకున్నారు. ముంబయిలోని ఓ హోటల్ ఈ శుభకార్యానికి వేదికయ్యింది. ఈ జంట రిజిస్టర్ మ్యారేజ్‌తో ఒక్కటయ్యారు. అమీర్‌ఖాన్, తన మాజీ భార్యలు రీనాదత్తా, కిరణ్‌రావుతో పాటు ముఖేశ్-నీతా అంబానీ దంపతులు తదితరులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. అమీర్‌ఖాన్-రీనాదత్తాల కుమార్తెగా ఐరాఖాన్ సినీ ప్రియులకు సుపరిచితమే.

నన్ను నేను తెలుసుకున్నా

ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ద్వారా దక్షిణాదిలో అరంగేట్రం చేస్తున్నది అందాల భామ జాన్వీకపూర్. బాలీవుడ్‌లో ఆమెకు విజయాల శాతం తక్కువే అయినా కథాంశాల ఎంపికలో వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తుందనే పేరుంది. ఐదేళ్ల కెరీర్‌లో నటిగా ప్రతి సినిమాకు పరిణితి సాధించింది. ఇటీవల తన సోదరి ఖుషీ కపూర్‌తో కలిసి 'కాఫీ విత్ కరణ్'షోలో పాల్గొంది జాన్వీకపూర్. ఈ సందర్భంగా తన తొలి తెలుగు చిత్రం 'దేవర'ను ప్రశంసలతో ముంచెత్తింది. ఈ సినిమా ద్వారా నటిగా తన అసలైన ప్రతిభ ఏమిటో తెలుసుకున్నానని చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'ఇప్పటివరకు నేను చేసిన సినిమాలతో పోల్చితే 'దేవర' చాలా ప్రత్యేకం. సెట్స్‌లో అడుగుపెట్టిన దగ్గరి నుంచి ప్రతీ రోజు ఓ కొత్త విషయాన్ని నేర్చుకుంటున్నా. నటిగా నా నిజమైన సామర్థ్యం ఏమిటో ఈ సినిమా ద్వారా తెలిసింది. మొత్తంగా చెప్పాలంటే ఈ సినిమాతో ఓ నటిగా, వ్యక్తిత్వపరంగా నన్ను నేను కొత్తగా తెలుసుకున్నా' అని చెప్పింది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దేవర' ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. తొలిభాగం ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది.

'గుంటూరు కారం' చిత్రంలో మీనాక్షి చౌదరి, మహేష్‌బాబు

'సత్యభామ' యాక్షన్ హంగామా

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. ఈ చిత్రంలో కాజల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో నటిస్తున్నది. 'సత్యభామ' సినిమాను అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో శరవేగంగా షూటింగ్ జరుపుకొన్నదీ సినిమా. 35 రోజుల భారీ షెడ్యూల్‌ను కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా చిత్రీకరణ 90 శాతం పూర్తయ్యింది. ఈ షెడ్యూల్‌లో హ్యూజ్ యాక్షన్ సీన్స్ చేసింది కాజల్ అగర్వాల్. ఫైట్ మాస్టర్ సుబ్బు ఆధ్వర్యంలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించారు. కాజల్ గతంలో ఎప్పుడూ కనిపించని యాక్షన్ మోడ్‌లో 'సత్యభామ'లో కనిపించనున్నది. కాజల్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో శ్రమించి ఈ యాక్షన్ సీక్వెన్సులు కంప్లీట్ చేసింది. సినిమాలో ఈ పోరాట ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణ అవుతాయని టీమ్ నమ్ముతున్నది. బ్యాలెన్స్ షూటింగ్ కంప్లీట్ చేసుకొని త్వరలోనే రిలీజ్ డేట్‌ను అనౌన్స్‌మెంట్‌కు సిద్ధంగా ఉన్న ఈ సినిమాలో నటీనటులు: కాజల్ అగర్వాల్, ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర తదితరులు, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: జీ విష్ణు, నిర్మాతలు: బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి, దర్శకత్వం: సుమన్ చిక్కాల.

'హను-మాన్'కు లాంగ్‌రన్ ఉంటుంది

నిర్మాతగా తొలి చిత్రాన్నే సూపర్‌హీరో జోనర్‌లో చేయడం ఆనందంగా ఉందని చెప్పారు కె.నిరంజన్ రెడ్డి. డిస్ట్రిబ్యూటర్‌గా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితుడైన ఆయన 'హను-మాన్' చిత్రం ద్వారా నిర్మాతగా అరంగేట్రం చేస్తున్నారు. ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత కె.నిరంజన్ రెడ్డి పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

'హను-మాన్' సోషియో ఫాంటసీ అంశాలతో కూడిన సూపర్ హీరో జోనర్ చిత్రం. హనుమంతుడు చిరంజీవి. ఆయన ఇప్పటికీ హిమాలయాల్లో తపస్సు చేస్తూ ఉన్నారని భారతీయులు విశ్వసిస్తారు. యూనివర్సల్ సూపర్‌హీరో హనుమాన్. ఆయన మహాబలశాలి. అసాధారణమైన శక్తియుక్తులు కలిగివాడు. దుష్టశిక్షణ కోసం ఆయన చేసిన అద్భుత విన్యాసాలను ఈ సినిమాలో ఆవిష్కరించాం. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులందరూ ఓ కొత్తలోకంలో విహరించిన అనుభూతికిలోనవుతారు.

ఐదురెట్లు బడ్జెట్ పెరిగింది

దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడే గ్లోబర్ ఆడియెన్స్‌కు రీచ్ అవుతుందనిపించింది. హాలీవుడ్ మార్వెల్ డీసీ చిత్రాల తరహాలో మన ఇండియన్ సినిమాలకు ఫ్రాంఛైజీలు లేవు. ఆ లోటును భర్తీ చేయాలని 'హను-మాన్' చేశాం. అనుకున్న బడ్జెట్‌కంటే ఐదారు రెట్లు ఎక్కువైంది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 20కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగింది. నాన్ థియేట్రికల్ బిజినెస్ కూడా అనుకున్నదానికంటే ఎక్కువే జరిగింది. సంక్రాంతి పోటీ గురించి మేము పెద్దగా ఆలోచించడం లేదు. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. 'బేబీ' 'బలగం' లాంటి సినిమాలు అదే విషయాన్ని నిరూపించాయి.

మూడేళ్లు కష్టపడ్డాం

హను-మాన్ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఎక్కడా ఒక్క నెగెటివ్ కామెంట్ కూడా రాలేదు. ఈ డిజిటల్ యుగంలో నిజంగా అదొక గ్రేట్ అచీవ్‌మెంట్. ఈ చిత్రానికి లాంగ్‌రన్ ఉంటుందని ఆశిస్తున్నాం. ఓ ఆరువారాల పాటు థియేటర్స్‌లో ఆడుతుందని అనుకుంటున్నాం. ఇంకా ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. వాటిని తెరపై చూడాల్సిందే. ఈ సినిమా కోసం దాదాపు మూడేళ్లు కష్టపడ్డాం. వందశాతం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాం. మా సంస్థ తదుపరి చిత్రాల వివరాలను ఫిబ్రవరిలో వెల్లడిస్తాం.



మిర్నా మీనన్

ఎవరికోసమో ఎదురుచూపులు..

తమిళ, మలయాళ భాషల్లో యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది మిర్నా మీనన్. ముఖ్యంగా రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో ఆమె పాత్రకు మంచి పేరొచ్చింది. ప్రస్తుతం ఈ సొగసరి నాగార్జున 'నా సామిరంగ' చిత్రంలో రెండో నాయికగా నటిస్తున్నది. విజయ్ బిన్ని దర్శకత్వం వహించిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం 'నా సామిరంగ' చిత్రంలో మంగ పాత్రలో మిర్నా మీనన్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఈ అమ్మడు సంప్రదాయం ఉట్టిపడే చీరకట్టులో అచ్చ తెలుగందంతో మెరిసిపోతున్నది. నచ్చిన చెలికాడి కోసం ఎదురుచూపులు చూస్తున్నట్లుగా ప్రశాంత వదనంతో కనిపిస్తున్నది. గ్రామీణ నేపథ్యంలో హృదయాన్ని కదిలించే ప్రేమకథ, స్నేహం అంశాల కలబోతగా 'నా సామిరంగ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మిర్నా మీనన్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. అల్లరి నరేష్, రాజ్‌తరుణ్, ఆషికా రంగనాథ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, దర్శకత్వం: విజయ్ బిన్ని.



సిద్ధు జోడీగా వైష్ణవి

దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ గత చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు చేసింది. రెండేళ్ల విరామం తర్వాత ఈ దర్శకుడు సిద్దు జొన్నలగడ్డ హీరోగా ఓ కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రారంభించారు. ఈ చిత్రంలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. గురువారం వైష్ణవి చైతన్య బర్త్‌డే కావడంతో మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నలుపు రంగు దుస్తుల్లో అందంగా కనిపిస్తోంది భామ. 'ఆమె త్వరలో అందించబోయే అద్భుతమైన ప్రదర్శనను చూసేందుకు సిద్ధంగా ఉండండి!' అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ ఫస్ట్ లుక్ రివిల్ చేశారు. తాత్కాలికంగా 'ఎస్‌వీసీసీ37' అనే పేరుతో మొదలైన ఈ ప్రాజెక్టులో వైష్ణవి ఓ ముస్లిం అమ్మాయిగా నటిస్తున్నట్టు ఫస్ట్ లుక్ చూస్తే తెలుస్తోంది. శ్రీవేంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'పింకీ'

వీఆర్‌పీ క్రియేషన్స్ పతాకంపై పి.పద్మావతి సమర్పణలో కిరణ్, మౌర్యాణి జంటగా నటిస్తున్న చిత్రం 'పింకీ'. సీరపు రవికుమార్ దర్శకత్వంలో పసుపులేటి వెంకటరమణ నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి మొదటి వారంలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా గురువారం ఫిలిం చాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత తుమ్మపల్లి రామసత్యనారాయణ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, సాయి వెంకట్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఫ్యామిలీ, సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సుమన్, శుభలేఖ సుధాకర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అమర్, సంగీతం చిన్నా, నిర్మాత: పసుపులేటి వెంకటరమణ, కథ-స్క్రీన్ ప్లే-డైలాగ్స్-దర్శకత్వం: సీరపు రవికుమార్.

రవికుమార్, వెంకటరమణ, ప్రసన్న కుమార్

గీతానంద్, నేహా సోలంకి

మైండ్ గేమ్ మొదలైంది

గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రవి కస్తూరి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రేషేడ్‌లో ఉంటాయి. చనిపోదామనుకున్న ఓ వ్యక్తి రియల్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు? అందులోని టాస్క్‌ను ఎలా పూర్తి చేశాడు? అనే అంశాలతో యాక్షన్, రొమాన్స్ ప్రధానంగా నడుస్తుంది' అని తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: అభిషేక్ ఏ ఆర్, నిర్మాత: రవి కస్తూరి, కథ-స్క్రీన్‌ప్లే-డైలాగ్స్-దర్శకత్వం: దయానంద్.

హృద్యమైన ప్రేమకథ

కిషోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా 'ప్రేమ కథ'. ఈ చిత్రాన్ని టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ, సినీ వ్యాలీ మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా నేడు థియేటర్లలో విడుదల కానున్నది. గురవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. హృద్యమైన ప్రేమకథా చిత్రమిదని, యువతరాన్ని బాగా ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండెం, నిర్మాతలు: విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్, రచన-దర్శకత్వం: శివశక్తి రెడ్డి.

'ప్రభుత్వ జూనియర్ కళాశాల'లో రొమాంటిక్ సాంగ్

ప్రణవ్, షజ్ఞశ్రీ నాయకానాయికలుగా కొవ్వూరి అరుణ సమర్పణలో వస్తున్న సినిమా 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. గతంలో ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్, టీజర్, సాంగ్ విడుదలయ్యాయి. ఇప్పుడు రెండో పాటగా 'చల్లగాలి' అంటూ సాగే రొమాంటిక్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఇప్పటివరకు లిరికల్ సాంగ్స్ రిలీజ్ కాగా, ఫస్ట్ టైం ఈ మూవీకి సంబంధించి వీడియో సాంగ్ విడుదలైంది. 2000's బ్యాక్ డ్రాప్ నేటివిటికి తగ్గట్టుగా వస్తున్న ఈ సినిమా ముఖ్య తారాగణం: శ్రీ వేణుస్, రామ్ పటాస్, తేజగౌడ్, బాంబే పద్మ, శ్రీముని చంద్ర, మండపేట మల్లిక జాగుల. సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్, కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నిర్మాత: లోభువన్‌రెడ్డి కొవ్వూరి, రచన-దర్శకత్వం: శ్రీనాథ్ పులకురం.